# ఆత్మవిశ్వాసమే ఆనందానికి సోపానం

ఈ జగత్తంతము దైవాధీనమైయున్నది. దైవం సత్యాధీనమైయున్నాడు. సత్యం ఉత్తమాధీనమైయున్నది. అట్టి ఉత్తముడే దైవస్వరూపుడు.

ప్రేమస్వరూపులారా! ప్రతి మానవుడు సుఖాన్ని ఆశిస్తున్నాడు, దుఃఖము వలదంటున్నాడు. సుఖ దుఃఖములు రెండూ స్థిరమైనవి కావు. ఈ రెండూ ఎక్కడినుండి పుట్టుచున్నవో ఆ స్థానమును మాత్రమే మానవుడు విశ్వసించి, ఆరాధించాలి. ప్రతి మానవుడు సుఖదుఃఖములు, రాగద్వేషముల వంటి ద్వంద్వములను అనుభవిస్తున్నాడు. అట్టి మానవత్వానికి శాంతి ఎక్కడ? తాను సుఖమును ఏరీతిగా స్వాగతం చేస్తున్నాడో దుఃఖమును కూడా అదేరీతిగా స్వాగతం చేయాలి. ఇట్టి సమత్వం కలిగినవాడే నిజమైన మానవుడు. మనలను ఇతరులు గౌరవించాలని ఆశించినప్పుడు మొట్టమొదట మనం ఇతరులను గౌరవించాలి. కొందరికి ధనము లేకపోవచ్చును, కొందరికి గుణము లేకపోవచ్చును, కొందరికి సిరిసంపదలు లేకపోవచ్చును. కాని ప్రతి మానవునియందు ఆత్మగౌరవం సమానంగా ఉన్నది. అట్టి ఆత్మగౌరవమును నిలుపుకొనుటకు మానవుడు కృషి చేయాలి. ఆత్మగౌరవమే అన్నింటికంటే ఉత్తమమైనది. ఆత్మగౌరవమును నిలుపుకొన్న వ్యక్తి సర్వులను గౌరవిస్తాడు.

## శ్రద్ధ, విశ్వాసములే భవానీశంకరులు

ప్రేమస్వరూపులారా! ఈనాడు నేను మీకు నూతనంగా బోధించే విషయములేమీ లేవు. మీరు దుఃఖాన్ని మరచిపోవాలి, ఆనందాన్ని అనుభవించాలి, ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి, దివ్యత్వాన్ని అనుభవించాలి. ఇదే ఈనాడు నేను మీకు అందించే ప్రధానమైన సందేశం. మానవుడనగా కేవలం విలువైనవాడు మాత్రమే కాదు, ఉత్తముడైన జీవి కూడా. మానవుని హృదయం చాలా విలువైనది, మనస్సు అత్యంత మధురమైనది. ఈ సత్యాన్ని గుర్తించి మానవుడు తన హృదయంలో మధురమైన ప్రేమను నింపుకోవాలి, మనస్సులో సమత్వాన్ని పోషించుకోవాలి.

sri sathyasai vachanamrutam

ఇంతకంటే మించిన భాగ్యం మరొకటి లేదు. మానవుడెంతటి గొప్పవాడనేది మీకు తెలియదు. "దైవం మానుష రూపేణ." భగవంతుడుకూడా మనుష్యరూపాన్ని ధరిస్తుంటాడు. ప్రతి మానవునియందు దివ్యత్వమున్నది.

భవానీ శంకరులు మానవునియందే ఉన్నారు. శివ శక్త్యాత్మకస్వరూపమే భవానీశంకరులు. 'భవాని' అనగా శ్రద్ధ. 'శంకరుడ'నగా విశ్వాసం. శ్రద్ధ అనే భవాని ఎక్కడ ఉంటుందో అక్కడ విశ్వాసమనే శివుడు తాండవమాడుతాడు. శ్రద్ధ, విశ్వాసములే లేకుండిన జీవితమే శూన్యం. జగత్తంతయు ఈ రెండింటిపైననే ఆధారపడియున్నది. శ్రద్ధ అనే భవాని, విశ్వాసమనే శంకరుడు అందరియందూ ఉన్నారు. ఈ ప్రకృతి అంతయు అర్ధనారీశ్వరతత్త్వమే. మానవత్వంలో ఉన్న ఈ దివ్యత్వమును గుర్తించటానికి ప్రతి వ్యక్తి ప్రయత్నించాలి. ఇంతకంటే గొప్ప ఆధ్యాత్మికం మరొకటి లేదు. భవానీశంకరుల ఆరాధనయే మానవుని ప్రధాన కర్తవ్యం.

**సుఖముకంటే దుఃఖమే మనకు గొప్ప మిత్రుడు**

మానవుడనుభవించే సుఖదుఃఖములు, రాగద్వేషములు, విషయ వాసనలు... ఇవన్నీ మనస్సు నుండియే ఆవిర్భవిస్తున్నాయి. మనస్సు ద్వైతభావంతో కూడియుండటంచేతనే ఇవన్నీ కనిపిస్తున్నాయి. మనస్సులో ఏకాత్మభావాన్ని పెంచుకున్నప్పుడు ఇలాంటి ద్వంద్వభావాలు ఏమాత్రం కల్గవు. మానవుడు సుఖదుఃఖాలను సమభావంతో స్వీకరించాలి. దుఃఖంవలన నష్టముకంటే లాభమే ఎక్కువగా ఉంటుంది. ప్రాచీనకాలంలో మహనీయులు దుఃఖమునే ఆశించారుగాని, సుఖమును ఆశించలేదు. సుఖమునుండి లభించే ఆనందముకంటే దుఃఖమునుండి లభించే ఆనందమే శాశ్వతమైనది. నిజానికి సుఖముకంటే దుఃఖమే మనకు గొప్ప మిత్రుడు.

మహాభారతంలో కుంతీదేవి కృష్ణుని పాదములపై పడినప్పుడు కృష్ణుడు "అమ్మా! నీకేమి కావాలి?" అని ప్రశ్నించాడు. కుంతీదేవి "కృష్ణా! నాకు నిరంతరం కష్టములనే ప్రసాదించు. ఎందుకంటే, కష్టసమయమందే నిన్ను అమితంగా పూజించాను, ప్రేమించాను. నేను పాండురాణిగా సకల భోగభాగ్యములను అనుభవిస్తున్నప్పుడు నిన్ను ఏమాత్రం స్మరించలేదు. ఏనాడైతే నా కుమారులు అరణ్యముల పాలైనారో ఆనాటి నుండియే నిన్ను అధికంగా

sri sathyasai vachanamrutam

స్మరిస్తూవచ్చాను. కనుక నాకు కష్టములనే ప్రసాదించు" అని కోరింది.

ప్రేమస్వరూపులారా! మీరు కష్టములకు విచారించకూడదు, ఆనందముకోసం అఱ్ఱులుజాచకూడదు. దుఃఖమే మనకు నిజమైన ఆనందమునందిస్తుందని విశ్వసించాలి. ఆనందమనే రసాన్ని అందించే ఫలమునకు పైనున్న తొక్కయే దుఃఖము. ఆ తొక్కను ఒలిచి బయట పారవేసినప్పుడే మనకు ఆనందమనే మధురరసము లభిస్తుంది. భగవంతుడు రసస్వరూపుడు. కనుకనే వేదము "రసోవైసః" అన్నది. మధురమైన రసమును చేదుగా ఉన్న తొక్క కప్పి ఉన్నట్లుగా, ఆనందమనే మధురరసమును దుఃఖమనే చేదు తొక్క కప్పి ఉంచుతుంది.

## దైవంతో చేరికయే ఆనందము

కష్టములు సంభవించినప్పుడు మీరు క్రుంగిపోకూడదు. కష్టములే మనకు సుఖమునందిస్తాయనే సత్యాన్ని మీరు గుర్తించాలి. కష్టములే లేకుండిన సుఖమునకు విలువే లేదు. ప్రతి మానవుడు తాను నిరంతరము హ్యాపీ (ఆనందం) గా ఉండాలని ఆశిస్తున్నాడు. ఈరోజు ఉదయం అనేకమంది నాకు "హ్యాపీ బర్త్‌డే" అని చెప్పారు. నేను ఎప్పుడూ హ్యాపీగానే ఉన్నాను. ఈనాడు ప్రత్యేకంగా నాకు "హ్యాపీ బర్త్‌డే" అని చెప్పటమెందుకు? హ్యాపీగా లేనివారికి ఆనందాన్నివ్వండి. నేనెప్పుడూ ఆనందంగానే ఉన్నాను. ఆనందం బయట లభించేది కాదు. దైవంతో చేరికయే ఆనందం. Happiness is union with God. కాని మానవుడు ఆనందము తనకంటే వేరుగా ఉన్నదని విశ్వసించి, దానిని పొందుటకు అనేక ప్రయత్నములు చేస్తున్నాడు; ఎన్నెన్నో యోచనలు చేస్తున్నాడు. కాని ఎన్ని యోచనలు చేసినా ప్రయోజన మేమిటి?

ఈ లోకసంబంధమైన విషయాలన్నీ దుఃఖమునే అందిస్తాయి. అయితే ఆ దుఃఖములోనే ఆనందము నిండియున్నది. కనుక సుఖదుఃఖములను రెండింటినీ సమత్వంతో స్వీకరించాలి. నిరంతరం ఆనందంగా ఉండాలి. ఏవో కొన్ని భౌతికమైన కష్టనష్టములు సంభవించవచ్చు. వాటికి మనం విచారించకూడదు. కష్టములే ఆనందమునకు ప్రథమ సోపానములని విశ్వసించాలి. పాండవులు 14 సంవత్సరములు కష్టముల ననుభవించటంచేతనే కృష్ణుడు వారి ఇంట, వెంట, జంట ఉండి కట్టకడపటికి వారికి విజయం చేకూర్చాడు. కష్టములందు

sri sathyasai vachanamrutam

దైవంయొక్క సహాయం తప్పక ఉంటుంది.

అలనాడు పాండవులు First God, next world, last I (మొట్టమొదట భగవంతుడు, తరువాత ప్రపంచం, చివరకు నేను) అని విశ్వసించారు. ముందు భగవంతుణ్ణి పెట్టుకొని, తరువాత ప్రపంచాన్ని పెట్టుకొని, నేననే అహంకారాన్ని మరింత వెనక్కి నెట్టారు. కాని కౌరవులు చేసిన పని ఏమిటి? First I, next world, last God (మొట్టమొదట నేను, తరువాత ప్రపంచం, చివరకు భగవంతుడు) అని భావించారు. కనుకనే వారు అపజయాన్ని పొందారు. వారికి ఆనందము ఏమాత్రం చిక్కలేదు. దైవత్వాన్ని సమీపంగా చేసుకున్నవారికి ఆనందము ఎప్పుడూ నిండుగా ఉంటుంది.

**హృదయమే భగవంతుని నివాసం**

మన పూర్వీకులు దైవాన్ని ఏరీతిగా ఆరాధించారు? సత్యమునే ప్రత్యక్ష దైవంగా స్వాగతించి, తమ హృదయమే భగవంతునికి సింహాసనంగా భావించి, త్యాగమనే పుష్పంతో ఆరాధించారు. అట్టి విశిష్టమైన ప్రార్థనవల్లనే ఆనాటి మహనీయులు దివ్యత్వాన్ని పొందగల్గారు. మీరు కూడా అట్టి పవిత్రమైన ప్రార్థన సల్పి, భగవంతుణ్ణి మీ హృదయపీఠంపై ప్రతిష్ఠించుకోవాలి. భగవంతుడనగా ఎవరు? 'భ' అనగా కాంతి, 'గ' అనగా వ్యాప్తి గావించటం, 'వాన్' అనగా సమర్థుడు. కాంతిని సర్వత్రా వ్యాప్తి గావించేవాడే భగవంతుడు. అతనికి ఎట్టి రూపమూ లేదు. తాను అణువుకంటే అతిసూక్ష్మమైనవాడు. ఇలాంటి భగవంతునికి మీరు ఎట్టి రూపాన్ని నిర్ణయించగలరు? మీలో ఉన్న ఆత్మయే భగవత్స్వరూపం. "బ్రహ్మలో మీరు, మీలోన బ్రహ్మ యుండె." మీకు, బ్రహ్మకు ఎట్టి భేదమూ లేదు. ఇట్టి భేదరహితతత్త్వాన్ని మీరు విశ్వసించకపోవటంచేతనే దుఃఖానికి గురి అవుతున్నారు. భగవంతునియొక్క రూపము ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ నిర్ణయించలేరు. అన్ని రూపములూ భగవంతునివే.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధసత్వమిదియె చూడరయ్య**

sri sathyasai vachanamrutam

సత్యం ఎక్కడున్నది? సర్వత్రా వ్యాపించియున్నది. సత్యం లేని స్థానమే లేదు. కనుకనే దైవం లేని స్థానం లేదు. భగవంతుడు సర్వవ్యాపకుడు. దీనిని పురస్కరించుకొనియే భగవద్గీత చెప్పింది –

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షిశిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి**

సత్యమే అన్ని రూపములూ దాల్చియున్నది. సత్యస్వరూపమైన దైవత్వం మానవునియందే ఉన్నది. కాని ఇట్టి సత్యాన్ని మానవుడు గుర్తించుకోలేక, దివ్యత్వం తనకంటే వేరుగా ఉన్నదని భావించి కాలమును వ్యర్థం గావించే కర్మలను ఆచరిస్తున్నాడు. కాలముచే మారని, చరిత్రచే మాయని, ప్రళయముచే తరగని, సృష్టిచే పెరగని ఏ నిత్యసత్యమైతే ఉన్నదో అట్టి నిత్యసత్యమే ఆత్మతత్త్వం.

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంత రహితుడనాదివాడు**
**తాను పుట్టక, చావక, చంపబడక**
**ఆత్మరూపుడై అంతట వెలసియుండు!**

కనుక మానవుడు తాను వేరు, దైవం వేరు అనే ద్వైతభావాన్ని దూరంగా నెట్టాలి. దైవం తన హృదయమందే ఉన్నాడని విశ్వసించాలి. హృదయమే భగవంతుని నివాసం. కనుక భగవంతునికోసం బయట వెతకనక్కర్లేదు.

**ఆత్మవిశ్వాసంతో ఉన్నతస్థాయికి చేరిన లింకన్**

అబ్రహాం లింకన్ చాలా బీదకుటుంబంలో జన్మించాడు. అతడు చిన్నతనంలో స్కూలుకి వెళుతుంటే అతని తోటి పిల్లలు “మేము విలువైన దుస్తులను ధరించాము. నీవు బీదవాడవు. ధరించటానికి నీకు సరియైన దుస్తులు కూడా లేవు” అని హేళన చేసేవారు. పసివాడైన లింకన్ ఈ అవమానాన్ని భరించలేక ఒకనాడు తల్లి ఒడిలో చేరి “అమ్మా! నాతోటి విద్యార్థులు నన్ను చాలా అవమానానికి గురి చేస్తున్నారు” అని ఏడ్చాడు. అప్పుడా తల్లి కుమారుణ్ణి బుజ్జగిస్తూ “నాయనా! ఈ అవమానంకూడా నీ మంచికోసమే అని భావించు. ఇతరులు చూపించే గౌరవమర్యాదల కోసం ప్రాకులాడవద్దు. నీ ఆత్మగౌరవాన్ని నిల్పుకో. అదియే నీ ఆస్తి, అదియే

sri sathyasai vachanamrutam

నీ సంపద. అదియే నీ దైవం. ఆత్మగౌరవాన్ని నీవెప్పుడూ కోల్పోవద్దు. ఆత్మవిశ్వాసంతో జీవించు" అని బోధించింది. తల్లి చెప్పిన మాటలు అతని లేతహృదయంలో నాటుకొనిపోయాయి. అప్పటినుండి లింకన్ తన జీవితంలో ఎదురైన ప్రతి కష్టాన్నీ ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో ధైర్యంగా ఎదుర్కొంటూవచ్చాడు. అన్ని పరీక్షలలోనూ చక్కగా ఉత్తీర్ణుడైనాడు. లింకన్‌లోని సద్గుణాలను గమనించి స్నేహితులు అతనిని ఎన్నికలలో పోటీ చేయవలసిందిగా ప్రోద్బలం చేశారు. ఒక్క క్షణంపాటు లింకన్ "నేనెక్కడ? ఆ పార్లమెంటు ఎక్కడ? నాకక్కడ సీటు లభిస్తుందా? కనీసం ఆ హాలులోనైనా నేను ప్రవేశించగలనా?" అని సందేహించాడు. మరుక్షణమే ఆ ఆలోచనను దూరంగా నెట్టాడు. "నా తల్లి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొమ్మని బోధించింది. కనుక ఆత్మవిశ్వాసంతో నిలబడి నేను ఎలక్షన్లలో పోరాడుతాను" అని తీర్మానించుకున్నాడు. అప్పటినుండి దృఢమైన ఆత్మవిశ్వాసంతో పోరాడి కట్టకడపటికి తాను అమెరికా దేశానికి ప్రెసిడెంటు అయినాడు. పేదవాడైన లింకన్ అమెరికా అధ్యక్షుడు కావటానికి కారణమేమిటి? ఆత్మవిశ్వాసమే. ఆత్మవిశ్వాసం లేనివాడు ఎటువంటి స్థానంలో ఉండినా తుదకు క్రిందికి దిగజారిపోతాడు.

## "నా జీవితమే నా సందేశం"

విద్యార్థులారా! ఆత్మవిశ్వాసమే లేకుండిన ఆనందం లభించదు. కనుక ఆత్మవిశ్వాసంతో మీరు జీవితాన్ని గడపండి. మీరే దైవం. మీ ఆత్మకంటే మించిన దైవత్వం లేదు. ఆత్మ విశ్వాసంతో సర్వజీవులను ప్రేమించండి. అసలు ద్వేషులనేవారే లేకుండా చూసుకోండి. మిమ్మల్ని ఎవరు ద్వేషించినప్పటికీ మీరు మాత్రం ఎవ్వరినీ ద్వేషించకండి. "నా జీవితమే నా సందేశం."

నన్ను మీరు అనుసరించండి. నన్ను ఎవరు దూషించినప్పటికీ, ఎవరు విమర్శించినప్పటికీ నేను ఎవరినీ ద్వేషించను, విమర్శించను. మీరిట్టి ఆదర్శాన్ని అనుసరించినప్పుడు మీరుకూడా సాయిబాబాతో సమానమైన తత్త్వాన్ని పొందుతారు. ఈనాడు నాకు ఇంతటి కీర్తి లభించిందంటే దీనికి కారణమేమిటి? నా ప్రేమతత్త్వమే దీనికి ప్రధానమైన కారణం. ఇదే నా నిజమైన ఆస్తి. కనుక ఈ ప్రేమతత్త్వాన్ని మీరు కూడా పంచుకొని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకొని లోకమునకు ఆదర్శాన్ని అందించండి. నేనీనాడు మీకు ఎక్కువగా ఏమీ చెప్పదల్చుకోలేదు. మీరు సుక్షేమంగా

sri sathyasai vahini

ఉంటూ, భారతదేశంయొక్క క్షేమమేగాక అన్ని దేశముల యొక్క క్షేమమునూ ఆశిస్తూరండి. "లోకాస్సమస్తాః సుఖినో భవంతు." అందరూ సుఖంగా ఉండాలని కోరుకోండి. అప్పుడే మీకు దివ్యమైన ఆనందం లభిస్తుంది. సంకుచితమైన భావాలను దూరం నెట్టి విశాలమైన భావాలను పెంచుకోండి. ఎవరైనా మిమ్మల్ని దూషించినా లేక, బాధించినా "ఇది నా మంచికోసమే" అని సహనభావంతో మీరు అనుభవించండి. సహనాన్ని మించిన గుణం మరొకటి లేదు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యీ
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

అందరియందు దేవదేవుడే దేహియై ఉన్నాడు. మీ ఇంటి ముందుకు భిక్షగాడు వచ్చి "భవతి భిక్షాందేహి" అని అడుగుతాడు. ఎవరిని? మిమ్మల్ని కాదు, మీయందున్న దేహిని; అనగా, దైవాన్ని అడుగుతున్నాడు. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకోలేక వాడు మిమ్మల్ని భిక్షమడుగుతున్నాడని మీరు భావిస్తున్నారు. ఇదియే అజ్ఞానము, అహంకారము. వాడు అడిగేది మిమ్మల్ని కాదు, దేహిని. మీ లోపలనున్న దివ్యశక్తియే దేహి. బీద, గొప్ప అనే భేదం లేకుండా ఆత్మతత్త్వం అందరియందున్నది. అట్టి దివ్యత్తమును మీరు ప్రేమతో ఆరాధించండి. అందరినీ ప్రేమించండి. మీ ప్రేమ స్వార్థరహితమైనదిగా, దేహాభిమానం లేనిదిగా ఉండాలి. దేహాత్మభావం సంకుచితమైనది. అది కేవలం దేహానికి, దేహానికి మధ్యగల సంబంధము. కాని, భగవంతునికి, మీకు మధ్యగల సంబంధము – హృదయానికి హృదయం, ప్రేమకు ప్రేమ.

**లోకమంతా స్వామిని ప్రేమిస్తోంది**

నేనెవ్వరికీ 'ఇన్విటేషన్' (ఆహ్వానం) పంపలేదు. నేనెప్పుడూ 'ఇన్విటేషన్' వేయించలేదు. అయినప్పటికీ ఈనాడింతమంది ఇక్కడికి వచ్చినారంటే, దానికి కారణం నాపైనున్న ప్రేమయే. లోకంలో కొంతమంది తమ అమ్మానాన్నల ప్రేమకే పాత్రులు కాలేరు. నేనింతమంది ప్రేమకు పాత్రుడనయ్యానంటే, ఇదే దైవత్వానికి చిహ్నం. లోకమంతా నన్ను ప్రేమిస్తోంది. ఈనాడు ఇక్కడకు వచ్చినవారు మాత్రమే కాదు, రాలేనివారు ఎన్ని కోట్లమందో ఉంటున్నారు. ఇంతమంది



srisathyasaivacheramrutam

ప్రేమకు పాత్రుడను కావటమే దైవత్వానికి నిదర్శనం. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు అందరికీ స్వామిపట్ల ప్రేమయే. ఈనాడిక్కడ తెల్లవారుజామున మూడు గంటలనుండి లోపల ప్రవేశించటానికి ఒకటే సందడి. లోకంలో మరి దేనికైనా ఇంత ఆతృతపడతారా? ఏదో ఒక సినిమా చూడాలంటే క్యూలో నిలబడతారు, బస్సులో పోవాలంటే క్యూలో నిల్చుంటారు. కాని స్వామిదగ్గర ఈ క్యూని కూడా లెక్కచేయరు, అంతా నెట్టుకొని వస్తారు; ప్రాణాలను కూడా లెక్కచేయరు. ముందుకు రావాలని, స్వామిని దర్శించాలని ఎంతో ప్రేమతో ఆత్రంగా ఉంటారు.

ఏనాడు ఏ తపస్సులు చేశారో మీరు, ఏ యాగములు ఆచరించారో మీరు, ఎన్ని విధములైన సాధనలు చేశారో మీరు – ఈనాడు ఇటువంటి ఆనందమును అనుభవించటానికి మీకు అవకాశం చిక్కింది. నేను అందరినీ ప్రేమిస్తున్నాను. నాకు ఎవ్వరూ అయిష్టమైనవారు లేరు. నా ప్రేమవల్లనే నేనింతమంది ప్రేమకు పాత్రుడనయ్యాను.

**"సర్వచింతలు బాపెడి సాయిప్రేమ గొనుడు"**

ప్రేమస్వరూపులారా! మీ మాటలతో, చేతలతో ఎవ్వరినీ బాధించకండి. అణువునుండి ఘనము వరకు సర్వత్రా ఉన్నది ఆత్మస్వరూపుడే అనే సత్యాన్ని గుర్తించండి. అట్టి సత్యస్వరూపుడు మీయందే ఉంటున్నాడు. కనుక మీరీనాడు తెలుసుకోవలసింది "ఈశ్వరస్సర్వ భూతానాం" అనే సత్యమును. భవాని – దేహతత్త్వము, శంకరుడు – ఆత్మతత్త్వము. భవానీశంకరుల సమ్మిళితస్వరూపమే మానవత్వం. ఈ రెండూ ఒకదానినొకటి అనుసరించియే ఉంటాయి. ఆత్మవిశ్వాసమే లేకుండిన ఎట్టి చిన్న కార్యమునైనా మీరు సాధించలేరు. కనుక మొట్టమొదట ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. అది ఉంటే ఈ జగత్తులో మీరు సాధించలేనిది ఏదీ లేదు. భగవంతుని తత్త్వాన్ని గుర్తించాలంటే మీరు గొప్ప సాధనలు, ఉపాసనలు, జపతపధ్యానములు చేయనక్కర్లేదు. హృదయ పూర్వకంగా ప్రేమిస్తే చాలు. దైవవిశ్వాసమును పెంచుకోండి. మీ దేహంలోనే భవానీశంకరులున్నారు. ఇట్టి పవిత్రమైన దేహంతో మీరు అపవిత్రమైన, నిషిద్ధమైన ఆహారమును ముట్టకూడదు. ఈనాటినుండి మీలో దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి – ఈ మూడూ దినదినాభివృద్ధి నొందాలి. దైవప్రీతి ఉన్నప్పుడే పాపమంటే భీతి కల్గుతుంది. అప్పుడే సంఘనీతి చేకూరుతుంది. పాపభీతి లేనందువల్లనే మానవుడు అనేక చింతలకు గురి

sri sathyasaivachanamrutam

అవుతున్నాడు.

**పుట్టుట ఒక చింత, భూమినుండుట చింత**
**సంసార మొక చింత, చావు చింత**
**బాల్యమంతయు చింత, వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత, చెడువు చింత**
**కర్మలన్నియు చింత, కష్టములొక చింత**
**సంతసమొక చింత, వింత చింత!**

ఇన్ని చింతలతో కూడిన మానవునికి చింతలు లేకుండా పోవాలంటే ఎలా సాధ్యమౌతుంది? ఈ చింతలన్నీ మనస్సునుండియే ఆవిర్భవిస్తున్నాయి. కనుక మీరు మనస్సును బానిసగా చేసుకోగల్గితే ఇక ఈ చింతలకు అవకాశమే ఉండదు. మనస్సే స్వాధీనమైతే ఇతరమైన మంత్రాలు, తంత్రాలతో పనిలేదని త్యాగరాజు కూడా చెప్పాడు.

**"సర్వచింతలు బాపెడి సాయిప్రేమ**
**గొనుడు ఇకనైన ప్రజలార ప్రేమతోడ"**

సమస్త చింతలూ దీనివల్లనే పరిహారమౌతాయి. కనుక మీరు సాయిప్రేమను పొందటానికి కృషి చేయండి. దైవప్రేమచేత మీరు దేనినైనా సాధించవచ్చు. కేవలం భారతీయులు మాత్రమే కాదు, విదేశీయులలోకూడా దైవప్రేమచేత ఎన్నియో ఘనకార్యములు సాధించినవారున్నారు. తల్లి ఆజ్ఞను శిరసావహించి ఆనందమును పొందినవారు ఎంతమందో ఉన్నారు. ప్రత్యక్షంగా మీ ఎదుటనున్న తల్లి, తండ్రి, గురువులను దైవస్వరూపులుగా భావించండి. "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" మొట్టమొదట తల్లిని ప్రేమించండి. తల్లిని ప్రేమించినవాడు తండ్రిని సహజంగా ప్రేమిస్తాడు. తల్లిదండ్రులను ప్రేమించిన వ్యక్తి గురువును ప్రేమిస్తాడు. మొట్టమొదట మిమ్మల్ని మీరు విశ్వసించండి. తనను తాను నమ్మలేనివాడు తల్లిని కూడా నమ్మలేడు. Faith in yourself, faith in God is the secret of greatness.

ప్రేమస్వరూపులారా! ఇంకా సాయంకాలం కూడా కొన్ని కార్య క్రమాలున్నాయి. ఇప్పటికే కాలాతీతమైంది. మీకు కొంత విశ్రాంతి అవసరమని నేను భావిస్తున్నాను. ఎంతైనా పొట్ట



sri sathyasai vachanamrutam

అంటూ ఒకటున్నది కదా! ఈ పొట్ట అనే పెట్రోలు ట్యాంకులో కొంత 'పెట్రోలు' వేయాలి. చాలామంది తెల్లవారుజామున రెండు గంటలు, మూడు గంటలకే వచ్చి ఇక్కడ కూర్చున్నారు. కనుక మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. స్వామి చెప్పిన విషయాలను మననం చేసుకుంటూ, ఆత్మ విశ్వాసంతో మీ జీవితాలను సార్థకం చేసుకోండి. దైవాజ్ఞను శిరసావహించండి. అప్పుడూ సర్వమూ మీకు సిద్ధిస్తాయి, సర్వమూ మీకు ఫలిస్తాయి. అన్నింటిలోనూ మీరు విజయాన్ని సాధించగలరు.

**(23.11.2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam